క్లుప్తంగా

నేటి నుంచి ఓబులేశుని ఉత్సవాలు

యల్లనూరు: మండల కేంద్రంలో రెండు రోజుల పాటు జరిగే ఓబులేశు స్వామి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఉత్సవిగ్రహాలను ఎడ్లబండిపై ఊరేగింపుగా తీసుకెళ్లి బొప్పేపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఓబులేశుని స్వామి గుడి వద్ద విగ్రహాలతో పాటు బస చేస్తారు. ఆదివారం వేకువజామున ఓబులేశు స్వామి తిరిగి యల్లనూరుకు వచ్చి నరసింహస్వామి ఆలయంలో కొలువుదీరుతాడు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పెద్దమ్మ అమ్మవారి ఆలయం ఎదుట మూగజీవాలను బలిదానం చేస్తారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోండి



నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

గుంతకల్లుటౌన్: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. శుక్రవారం ఆయన దోనిముక్కల రోడ్డులోని జగనన్న లేఔట్లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. థర్డ్ ఆప్షన్ కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. హౌసింగ్ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



నగదు అందిస్తున్న లక్ష్మీనారాయణరెడ్డి

శింగనమల: శింగనమలకు చెందిన మోహన్ వారం రోజుల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వైఎస్సార్‌బీమా కింద తక్షణ సాయం రూ.10 వేలను గ్రామ ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి శుక్రవారం మృతుడి భార్యకు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేంద్ర, మహిళా పోలీస్ హరిత, వైఎస్సార్‌సీపీ నేత నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

యాడికి: మండలంలోని 16 సచివాలయాల సిబ్బంది శుక్రవారం ఓటరు స్లిప్పులను పంపిణీ జేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉపాధ్యాయులు 46 మంది, పట్టభద్రులు 1,082 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఓటర్లు ఎవరికైనా స్లిప్ రాకపోతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

డాక్టర్ రోషన్ సేవలు మరువలేనివి



డాక్టర్ రోషన్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

శింగనమల: స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రోషన్ చేసిన సేవలు మరువలేనివని వైద్యులు కొనియాడారు. డాక్టర్ రోషన్ ఇటీవల అనంతపురం వైద్యకళాశాలకు బదిలీ అయ్యారు. దీంతో శుక్రవారం ఆస్పత్రిలో ఆయనను సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వక్తలు డాక్టర్ రోషన్ సేవలను కొనియాడారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్. రమణనాయక్, సిబ్బంది డాక్టర్ రోషన్‌ను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు.

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

యాడికి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు కట్టెపోగు బసవరాజు పేర్కొన్నారు. శుక్రవారం రాయలచెరువు ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకమత్యంతో ఎస్సీలందరూ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. అంబేడ్కర్ విగ్రహ దాత, పారిశ్రామిక వేత్త సీవీ రమణారెడ్డిని అభినందించారు. అంతకుమునుపు ఎస్సీ కమీషన్ మెంబర్‌కు గ్రామంలోని ఎస్సీలు ఘనంగా స్వాగతం పలుకుతూ సత్కరించారు. కార్యక్రమంలో దాసన్న, రాముడు, కుల్లాయప్ప మహేష్, ఓబులేసు, కిశోర్, ఎమ్మార్పీఎస్ నాయకులు పుల్లయ్య, నరసింహులు, సూర్యుడు తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంలో జేసీ సోదరులు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి





సంక్షేమ పాదయాత్రకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన కార్యకర్తలు, సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమపథకాల ద్వారా ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి జేసీ సోదరులకు ఓటమి భయం పట్టుకుందని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజాసంక్షేమ పాదయాత్ర నాలుగో రోజు పెండేకల్లులో ప్రారంభమై కుమ్మెత, సుంకేసులపల్లి, అత్తిరాల దిన్నె, కొట్టాలపల్లి వరకు సాగింది. ఆయా గ్రామాలకు చెందిన మహిళలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ప్రజలతో మాట్లాడారు. ఏప్రభుత్వంలో కూడా ఇన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టలేదన్నారు. కుల,మత,రాజకీయ భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేశారన్నారు. గత ప్రభుత్వంలో కేవలం రాజకీయ పలుకుబడి ఉంటేనే సంక్షేమపథకాలు వచ్చేవన్నారు. బాబు పాలనలో బోరుబావుల్లో భూగర్భజలాలు అడుగంటిపోయి కొత్తబోర్లు వేయించడానికి ఈప్రాంత రైతులు బంగారాన్ని తాకట్టు పెట్టే పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత చాగల్లు, పెండేకల్లు, ముచ్చుకోట ప్రాజెక్టులకు నీరు విడుదల చేయించడంతో ఎండిపోయిన బోరుబావుల్లో సైతం భూగర్భజలాలు సమృద్ధిగా పెరగడంతో బీడుభూములు తిరిగి సాగులోకి వచ్చాయన్నారు. గతంలో ఎన్నికల సమయంలో మాత్రమే ఓట్ల కోసం తీర్చలేని హామీలను ఇచ్చి గెలిచిన తర్వాత ఆ నాయకులు పత్తా లేకుండా పోయేవారన్నారు. అయితే ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రతి గడపకూ వెళ్లి స్వయంగా సమస్యలను అడిగి తెలుకుని వాటిని పరిష్కరిస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథరెడ్డి, ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్లమెంటు జనరల్ సెక్రటరీ రవిప్రసాద్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు హాజీవలి, ఎంపీటీసి నాగవేణి, సీనియర్ నాయకులు ముచ్చుకోట అమర్‌నాథ రెడ్డి, నామనాంకపల్లి రఘునాథరెడ్డి, వరదాయపల్లి శివారెడ్డి, కుమ్మెత నారాయణరెడ్డి, మంగళ రామయ్య, చంద్రోశేఖర్ రెడ్డి, సుంకేసులపల్లి గంగిరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, గంగచంద్రారెడ్డి, శివారెడ్డి, సతీష్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అత్తిరాలదిన్నె వాసుదేవరెడ్డి, ఎంసీ నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, కొట్టాలపల్లి రాంబాబు, అశోక్ కుమార్ నాయుడు, పాల రమణ తదితరులు పాల్గొన్నారు.

రేపు చెవి శస్త్ర చికిత్స శిబిరం

గుంతకల్లుటౌన్: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రోటరీహైస్కూల్‌లో ఉచిత మెగా చెవి శస్త్ర చికిత్స శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు వంకదారు ప్రదీప్, కమ్యూనిటీ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ పి.రామ్మూర్తి తెలిపారు. శుక్రవారం రోటరీక్లబ్‌లో శిబిరానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను వారు విడుదల చేశారు. అరవింద ఇండస్ట్రీస్ అధినేత సత్రసాల జగదీష్ గుప్త సౌజన్యంతో నిర్వహించనున్న వైద్యశిబిరాన్ని నియోజకవర్గం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. చెవి వినికిడి లోపం, చెవిపోటు, చెవిలో చీముకారుట, పుట్టుక నుంచి వినికిడిలోపం, ఇతర చెవి సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి కర్ణాటక చిత్రదుర్గకు చెందిన ప్రముఖ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ ఎన్‌టీ.ప్రహ్లాద నేతృత్వంలో వైద్యపరీక్షలు, అవసరమైన వారికి ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారన్నారు. క్లబ్ కార్యదర్శి డిష్ రాము, క్యాంప్ చైర్మన్ జి.శ్రీకాంత్, కోఆర్డినేటర్ డీవీ. సుబ్రమణ్యం, ఎల్‌వీ.గుప్త పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని జయనగర్‌కాలనీకి చెందిన షబనా అనే మహిళ కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ విజయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. నిందితురాలి నుంచి 22 ఓల్డ్ అడ్మిరల్ లీటర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఆమెను రిమాండ్‌కు తరలించామన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకుందాం

- ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి

గుత్తి: ఈ నెల 13వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు వైఎస్సార్ సీపీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని వసుధా ఫంక్షన్ హాల్లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డికి మద్దతుగా విస్తృత ప్రచారం చేయాలన్నారు. గెలుపు ఏ మంత కష్టంకాదని, అయితే అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమయం చాలా తక్కువ ఉందని అందరూ తామే పోటీ చేస్తున్నట్లు భావించి ఓట్లు అభ్యర్థించాలని పిలుపునిచ్చారు. వెన్నపూస రవీంద్రా రెడ్డి, రామచంద్రారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, ఎంపీపీ విశాలాక్షి, పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్ధన్‌రెడ్డి, పట్టణ, మండల సచివాలయ కన్వీనర్లు రంగస్వామి, సుభాష్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు రాజ్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాము, సీనియర్ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

పామిడి: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు కలిసికట్టుగా పని చేయాలని ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి కోరారు. శుక్రవారం ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి సైనికుల్లా పనిచేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు లిస్టులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, ఎస్ అనిమిరెడ్డి, ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి, మండల సచివాలయ పట్టణ, రూరల్ కన్వీనర్లు బీ ఆసిఫ్, ఎం కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటింగ్‌పై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న ఆర్డీవో రవీంద్ర

గుంతకల్లు రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌పై ఓటర్లు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఆర్డీఓ రవీంద్ర సూచించారు. శుక్రవారం స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో పట్టభద్రులకు, ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఆర్డీఓ, తహసీల్దార్ రాము, మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎంపీడీఓ జాషువా ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సువర్ణ, ఎంఈఓ కుళ్లాయప్ప ఓటింగ్ విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈనెల 13న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో 4 పోలింగ్ బూత్‌లు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఎంపీడీఓ కార్యాలయంలో ఒక పోలింగ్ బూత్ ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

తాడిపత్రి టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌పై ఓటర్లకు అవగాహన కల్పించాలని అధికారులు వార్డు సచివాలయ అడ్మిన్ సెక్రటరీలకు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయాల్లో వేర్వేరుగా శుక్రవారం ఓటు వినియోగంపై వార్డు సచివాలయ అడ్మిన్ సెక్రటీలకు అవగాహన సమావేశం జరిగింది. తహసిల్దార్ మునివేలు, మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, ఎంపీడీఓ రంగారావు, ఎంఈఓ నాగరాజు, ఈఓఆర్‌డీ జిలాన్‌బాషా ఎన్నికల విధులు, కార్యాచరణ అమలు, ఓటర్ వినియోగంపై వివరించారు.

శింగనమల: ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌పై ఓటర్లకు అవగాహన కల్పించాలని బీఎల్‌ఓలు, సచివాలయ కార్యదర్శులు, వీఆర్వోలకు తహసీల్దార్ ఈశ్వరమ్మ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఈఓఆర్‌డీ శివనారాయణరెడ్డి, ఎంఈఓ నరసింహరాజులు పాల్గొన్నారు.

యల్లనూరు: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియపై శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని తహసీల్దారు రమాదేవి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొండన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్నికల సరళి, ఎన్నికల ఏర్పాట్లు, ఓటు వేసే విధానాలను వివరించారు. ఎంఈఓ చంద్రశేఖర్, ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు, ఏఎస్‌ఓ కల్పన పాల్గొన్నారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో శుక్రవారం ఉపాధ్యాయులకు ఎంఈఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన కల్పించారు.

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికలపై ఓటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మహబూబ్ బాషా, మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలా ఓటు వేయాలో వివరించారు.

పామిడి: తహసీల్దార్ కార్యాలయ సభాభవనంలో శుక్రవారం ఎమ్మెల్సీ ఓటింగ్ విధానంపై అధికారులు ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ ఆర్‌వీ సునితబాయి, ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్, ఎంఈఓ జయానాయక్ హాజరయ్యారు.

పెద్దవడుగూరు : ఎమ్మెల్సీ ఓటింగ్ విధానంపై ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కుళ్ళాయిస్వామి, ఎంఈఓ రాముడు పాల్గొన్నారు.

మహిళలకు పౌష్టికాహారం తప్పనిసరి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

బుక్కరాయసముద్రం: మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా పీడీ మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ఉమా శంకరమ్మ, మండల వైద్యాధికారి స్వాతి లక్ష్మి, సూపర్‌వైజర్ కౌసల్య, ధనలక్ష్మి, లీగల్ కౌన్సిలర్ నర్మదా, వన్ స్టాఫ్ సెంటర్ మేనేజర్ శాంతమ్మ, డీసీపీఓ సుబ్రమణ్యం, యూనిసెఫ్ కోఆర్డినేటర్, నాగేంద్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : మహిళల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు శ్రీనివాసబాబు, హెచ్‌ఎం హరినాథ్ పేర్కొన్నారు. శుక్రవారం లక్ష్మంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ మహిళా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలు జరుగకుండా చూడాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఏఎన్‌ఎం బయమ్మ పాల్గొన్నారు.

నేడు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

యాడికి: స్థానిక శివలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగం శనివారం నుంచి రెండురోజుల పాటు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ ఆర్గనైజర్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు ఉంటాయన్నారు. వివరాలకు ప్రసాద్ 9701400712, మణి శంకర్ 8297972576 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

తాతార్యారూఢ స్వామి తిరునాల ప్రారంభం



అలంకరణలో తాతార్యారూఢ స్వామి

గార్లదిన్నె: మర్తాడులో శుక్రవారం తాతార్యారూఢ స్వామి తిరునాల శుక్రవారం ప్రారంభమైంది.ఉదయం 6గంటలకు ధ్వజారోహణము, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకము నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కు లు తీర్చుకున్నారు. శనివారం సూర్యోదయాత్పూర్వం, గంగపూజ, కలశస్థాపన రుద్రయజ్ఞం, రాత్రి 10 గంటలకు స్వామి రథోత్సవం నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ముగిసిన ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ టోర్నీ

తాడిపత్రి టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గత నెల 27న ప్రారంభమైన ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ క్రికెట్ టోర్నీ శుక్రవారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో నారాయణ, శ్రీచైతన్య జట్లు తలపడ్డాయి. ఇందులో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీ చైతన్య జట్టు 97 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన నారాయణ జట్టు 15 ఓవర్లలో 87 పరుగులు మాత్రమే చేసింది. విజేతలకు డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నారాయణస్వామి, పీడీ విజయలక్ష్మి, ఆర్టీటీ సీనియర్ కోచ్ సాధక్ షీల్డు పంపిణీ చేశారు.

వైభవంగా శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ట



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుత్తి రూరల్: కొత్తపేట గ్రామంలో శ్రీ కృష్ణ విగ్రహం, ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా జరిగాయి. శుక్రవారం ఉదయం నుంచి ఆలయంలో అర్చకులు మంత్రస్థాపన, కూష్మాండబలి, పూర్ణాహుతి, మహామంగళ హారతి, కుంకుమార్చన, అభిషేకాలు, అర్చన, హారతులు ఇచ్చారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆలయానికి చేరుకుని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, మునిసిపల్ చైర్‌పర్సన్ వన్నూరుబీ, వైస్ ఎంపీపీ తిరుపాలమ్మ, సర్పంచ్ గురుమస్తాన్, నాయకులు గోవర్ధన్ రెడ్డి, ప్రవీణ్, గురుప్రసాద్‌యాదవ్, రాముయాదవ్, సుధాకర్, వెంకటరాముడు, సురేష్, సుభాష్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను ఆశీర్వదించండి



తాడిపత్రిలో ప్రచారం చేస్తున్న ఫయాజ్‌బాషా

గుంతకల్లు రూరల్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులను తమ ఓటుతో ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టభద్రులు, ఉపాధ్యాయులను కోరారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, సచివాలయ కన్వీనర్ వినోద్‌కుమార్‌రెడ్డి, మొలకలపెంట సర్పంచ్ మురహరినాయుడు, ఇతర నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం మొలకలపెంట, కొంగనపల్లి గ్రామాల్లోని సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ముమ్మర ప్రచారం నిర్వహించారు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలూ శ్రమిస్తున్న ముఖ్యమంత్రి జగనన్న ఆదర్శంతో ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని తమ అమూల్యమైన ఓటుతో గెలిపించాలని కోరారు. నాయకులు ఎంపీటీసీ నాగప్ప, సాయిరాంరెడ్డి, స్టూడెంట్ యూనియన్ నాయకుడు వంశీ యాదవ్, సుధాకర్, రవి, పార్థ నాయుడు పాల్గొన్నారు.

యాడికి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలను గెలిపించాలని మండల సచివాలయాల కన్వీనర్ శివ ప్రసాద్ కోరారు. శుక్రవారం చందన, పచ్చారు మేకలపల్లెలో ప్రచారం నిర్వహించారు. చందన ఎంపీటీసీ రాగుల పార్వతి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వెంకటరామి రెడ్డి పాల్గొన్నారు.

పుట్లూరు: వైఎస్సార్‌సీపీ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన జంగంరెడ్డిపేట, మడుగుపల్లి, ఎల్లుట్ల, కడవకల్లు, కుమ్మనమల, మడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేత కృష్ణవేణి, యల్లనూరు, పుట్లూరు కోఆర్డినేటర్ ఆదిరెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి టౌన్: వైఎస్సార్ సీపీ తరపున పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి, టీచర్ స్థానానికి పోటీ చేస్తున్న ఎంవీ రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ 2వ వార్డు కౌన్సిలర్ హీరాపురం ఫయాజ్‌బాషా ఓటర్లను కోరారు. పట్టణంలోని పడమర గేరిలోని ఓటర్ల ఇంటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఆయన వెంట వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు షాషా, ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా, సభ్యులు చవ్వా రాజశేఖర్‌రెడ్డి, వలి తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే జైలుశిక్ష తప్పదు



విద్యార్థులకు సూచనలిస్తున్న వైద్యురాలు సాయినాగశ్రీ

యల్లనూరు: లింగనిర్ధారణ, అబార్షన్ చేసినా జైలు శిక్ష తప్పదని వైద్యురాలు సాయినాగశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం తిమ్మంపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ దిశ, ఫోక్సో యాక్టులను వివరించారు. పొగాకుతో అనర్థాలు, రక్తహీనత, బాల్య వివాహాలు తదితర వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఎంపీహెచ్‌ఈఓ వీరనారప్ప, పీహెచ్‌ఎన్ జగదాంబిక, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ అల్సియా భాను, ఏఎన్‌ఎం జాస్మిన్‌బేగం, ఆశా శమంతకమణి పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: బాలికలకు చదువులతో పాటు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని వెంకటాపురం పాఠశాల హెచ్‌ఎం వసుంధర పేర్కొన్నారు. శుక్రవారం కొర్రపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వెంకటాపురంలో బాలికల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ పర్వీన్ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

బయోమెట్రిక్ తప్పనిసరి

నార్పల: సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలని డి డీఎల్‌డీఓ ఓబులమ్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంలోని సచివాలయం-2ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులు, బయోమెట్రిక్ హాజరుశాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో రోజూ స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ఎంపీఈఓ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎల్‌పీఓ సుమనజయంతి

నార్పల: ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి సుమనజయంతి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని పలు సచివాలయాలను, చెత్త నుంచి సంపద కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ఎన్నో సేంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. సచివాలయాలకు వచ్చే ప్రతి సమస్యను వెంటనే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ దివాకర్, ఈఓఆర్డీ లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం

గుంతకల్లుటౌన్: గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను పెంచుతూ సామాన్యుల నడ్డి విరిస్తున్న ప్రజావ్యతిరేక మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదామని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ ప్రజలకు పిలుపునిచ్చారు. గ్యాస్ ధరలను పెంపును నిరసిస్తూ శుక్రవారం స్థానిక భగత్‌సింగ్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. సురేష్ మాట్లాడుతూ తొమ్మిదేళ్ల మోదీ పాలనలో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్‌పై రూ.700, కమర్షియల్ సిలిండర్‌పై రూ.1000 పెంచిందన్నారు. వీటితో పాటు డీజిల్, పెట్రోల్ ధరలను కూడా అమాంతంగా పెంచుతూ పోవడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు జీవించడమే కష్టంగా మారిందన్నారు. గ్యాస్ ధరలను తగ్గించకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని ఆయన పేర్కొన్నారు. పార్టీ పట్టణ కార్యదర్శి జి.చిన్నా, నాయకులు శ్రీరాములు, ఆశాబీ, సత్తార్, రామాంజి, గోపి తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్లో శుక్రవారం గ్యాస్ ధరల పెంపుపై సీపీఐ నాయకులు,కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి రామదాసు, సీనియర్ నాయకులు రమేష్, మాబు, అశోక్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : నిత్యావసరాల ధరలు నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం అయిందని మండల సీపీఐ నాయకులు వెంకట్రాముడుయాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం క్రిష్టిపాడు గ్రామంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులు రంగస్వామి, అల్లాబకాస్, నారాయణస్వామి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: గ్యాస్ ధరలు తగ్గించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో గ్యాస్ సిలిండర్‌తో ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి నారాయణస్వామి, చేతి వృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి హరికృష్ణ, రైతు సంఘం కార్యదర్శి రాము, వ్యవసాయ కార్మిక సంఘం శ్రీనివాసులు, మండల సమాఖ్య కార్యదర్శి నాగమణి, వెంకట్, బాషా పాల్గొన్నారు.